క్లుప్తంగా

కన్నీటి చింత

- ప్రభుత్వం స్థలంలో యథేచ్ఛగా చెట్లు నరికివేత



సీకే పురం పెద్ద చెరువు కట్టపై నేలకొరిగిన చింత చెట్టు

శ్రీరంగరాజపురం(కార్వేటినగరం): ప్రభుత్వ స్థలాల్లో ఉన్న చెట్లను నరికి అక్రమార్కులు యథేచ్ఛగా సొమ్ము చేసుకుంటున్నారు. ఆది వారం ప్రభుత్వ అధికారులు అందుబాటులో లేరని గుర్తించిన ఓ వ్యక్తి తమ సొంత పనుల నిమిత్తం ప్రభుత్వ స్థలంలో చెరువు కట్టపై ఉన్న చింత చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నట్లు ఎస్ఆర్ పురం గ్రామస్తులు తెలిపారు. అటవీశాఖ అధికారులకు మామూళ్లు చెల్లిస్తూ కూటమి నాయకుల అండతో కలపను సరిహద్దుల్లోని తమిళనాడు ప్రాంతానికి తరలించేస్తున్నారు. సీకే పురం పెద్ద చెరువు కట్టపై ఉన్న చింత చెట్టును నరుకుతున్నట్లు సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తప్పించుకోవడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

శ్రీరంగరాజపురం (కార్వేటినగరం): మండలంలోని ఆరిమాకులపల్లె సమీపంలోని గంగమ్మ గుడి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. గంగాధర నెల్లూరు మండలంలోని కోటాగరం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆదివారం ద్విచక్ర వాహనంలో పుత్తూరు వైపు వస్తుండగా గంగమ్మ గుడి వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని ఆరిమాకుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

అమరజీవి సేవలు చిరస్మరణీయం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అమరజీవి పొట్టిశ్రీరాములు సేవలు చిరస్మరణీయమని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ స్థాపన కమిటీ ఉపాధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి అన్నారు. చిత్తూరు నగరంలోని గంగినేని పార్కులో ఆదివారం కమిటీ ఆధ్వర్యంలో అమరజీవి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పొట్టిశ్రీరాములు భవిష్యత్ తరాల వారికి మార్గదర్శకమన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో కుప్పం రెడ్డమ్మ వ్యవస్థాపకులు రామలక్ష్మి, సభ్యులు పార్థసారథి నాయుడు, నాగరత్నం, సహదేవనాయుడు, గోవర్ధన్ బాబి పాల్గొన్నారు.

23న పైనేని మునెమ్మ స్మారక పురస్కారాల ప్రదానం

పలమనేరు: ఈనెల 23న శ్రీరంగరాజపురం మండలంలోని ఆరిమాకులపల్లెలోని తెలుగు తల్లి కళా ప్రాంగణంలో పైనేని మునెమ్మ స్మారక పురస్కారాల ప్రదానం చేయనున్నట్టు స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇదివరకు నిర్వహించిన కథల పోటీల్లో గెలుపొందిన పది మంది రచయితలకు నగదు పురస్కారాలతో సత్కరించనున్నట్టు తెలియజేశారు.

న్యూ ప్రశాంత్ నగర్‌లో సమస్యల తిష్ట

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో న్యూ ప్రశాంత్ నగర్‌లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని సీపీఎం జిల్లా కమిటీ జిల్లా కమిటీ సభ్యులు సురేంద్రన్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా న్యూప్రశాంత్ నగర్ కాలనీవాసులు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారన్నారు. కాలనీలో మురుగు నీటి కాలువలు లేకపోవడం మురుగునీరు రోడ్ల పైనే నిల్వ ఉంటోందన్నారు. శ్మశానవాటికకు భూమి లేకపోవడం, బస్సు సౌకర్యం, హెల్త్ క్లినిక్ తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అధికారిక యంత్రాంగం ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ప్రియా, కళ, రాధమ్మ, గీతమ్మ, వెంకటేశు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతన్నా.. వేసవి దుక్కులు చేసుకో..

పంట కోతల తరువాత మళ్లీ వర్షాకాలంలో వచ్చేంత వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారుతాయి. వేసవి దుక్కలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ప్రతి రైతు తప్పనిసరిగా గుంటుకలు వేయాలి. గ్రామాల్లోని ఆర్బీకేలలో వ్యవసాయ సహాయకులను సంప్రదించి భూసార పరీక్షల చేయించుకోవాలి.

–పాలసముద్రం

- వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు
- సస్యరక్షణ చర్యలతో క్రిమికీటకా నిర్మూలన
- భూసార పరీక్షలు చేయించుకోవాలి



వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ఇవీ ప్రయోజనాలు

పంటలు లేని వేసవిలో చీడ పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు భూమిని ఆశ్రయిస్తాయి. వేరుశనగ, పప్పు శనగ, మిరప, కంది తదితర పంటలకు ఆశించే పచ్చ పురుగు, లద్దె పురుగులు భూమిలో ఉంటాయి. వేసవిలో లోతు దుక్కులు చేయడంతో నేలలో ఉన్న చీడ పురుగుల కోశాలు, గుడ్లు బయటపడి వేడికి చనిపోతాయి. కొంగలు, కాకులు తదితర పక్షులు వాటిని తిని నాశనం చేస్తాయి. సమగ్ర సస్యరక్షణ పద్ధతుల్లో భాగంగా వేసవిలో లోతు దుక్కులను చేయడంతో పురుగు మందుల వ్యయం తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది. రబీ పంటలు కోసిన తర్వాత తేమ ఉన్నప్పుడు వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. వర్షాలకు ముందు భూమిని దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు నేలలోకి ఇంకుతుంది. ఈ దుక్కులతో ఇతర గడ్డిజాతి మొక్కల విత్తనాలు కూడా వేసవి ఉష్ణోగ్రతలకు గురై మొలిచే శక్తిని కోల్పోతాయి. వేసవి దుక్కులు చేపట్టడానికి ఏప్రిల్ నెల అనువైన సమయం. వేరుకుళ్లు తెగులును కలిగించే శిలీంధ్ర సిద్ధ బీజాలు నిరంతరం భూమి అడుగుభాగానే ఉంటూ వర్షం పడగానే విజృంభించి పంటను నాశనం చేస్తాయి. అదేవిధంగా భూమి అడుగు భాగాన ఉన్న గడ్డి మూలాలు వర్షం పడగానే పెరిగిన పంటను దెబ్బతీస్తాయి. వీటిని నివారించడానికి వేసవి సమయంలో పొలాల్లో ఒకటిన్నర అడుగు లోతు వరకు రెండు మడకలతో వేసవి దుక్కులు దున్నాలి. దీంతో భూమి లోపల ఉన్న శిలీంధ్ర సిద్ధ బీజాలతోపాటు, గడ్డి మూలాలు కూడా బయట పడి అధిక ఉష్ణోగ్రతకు నశించిపోతాయి. వేసవి దుక్కులతో భూమి వదులుగా మారి వర్షం పడినప్పుడు గాలి, నీరు, ఉష్ణోగ్రత సమానంగా ఇంకిపోయి విత్తనాలు మొలకెత్తడానికి అనుకూలంగా ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

దుక్కుల అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువు పొలంలో చల్లుకోవాలి. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు కూడా సమృద్ధిగా అందుతాయి. మార్చి రెండో వారం నుంచి మే మొదటి వారం వరకు వేసవి దుక్కులు చేపట్టడానికి అనుకూలమైన కాలం.

భూసారం పెరుగుతుంది



వేసవి దుక్కులు చేసుకుంటే భూమిలో ఉన్న చీడ పురుగుల గుడ్లు బయటి పడి కీటకాలు నశిస్తాయి. వీటి వల్ల పురుగు మందుల వాడకం తగ్గి వాతావరణ కాలుష్యం కూడా ఉండదు. రబీ పంటల కోత తర్వాత వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు చేయాలి. తొలకరి వర్షాలు కురిసినప్పుడు భూమిలోకి నీరు ఇంకిపోయి నేల సారవంతం అవుతుంది. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఇందుకోసం ఆర్బీకేలలో అగ్రికల్చర్ అసిస్టెంట్లను సంప్రదించాలి.

–ఢిల్లీప్రసాద్, మండల వ్యవసాయాధికారి

వైఎస్ఆర్ సీపీతోనే గ్రామాల అభివృద్ధి



మూర్తిరాజు వీధిలో సీసీ రోడ్డు పనుల ప్రారంభం

కార్వేటినగరం: వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయని ఎంపీపీ లతా బాలాజీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మూర్తిరాజు వీధిలో రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ ధనుంజయవర్మతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడే అభివృద్ధి పనులు పరుగులు తీశాయని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ ప్రధాన కార్యదర్శి బాలాజీ, వార్డుమెంబర్ అంబిక, షబ్బీర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కేశవులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

గంగాధరనెల్లూరు: అమరజీవి శ్రీపొట్టిశ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన త్యాగం మరువలేనిదని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి అన్నారు. శ్రీపొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా అంజలి ఘటించి, నివాళులర్పించారు.

బాధిత కుటుంబాలకు భరోసా



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

వడమాలపేట (విజయపురం): అయినవాళ్లను పోగొట్టుకున్న కుటుంబాలకు తానున్నానంటూ మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. ఆదివారం వడమాలపేట మండలం పూడికి వెళ్లిన ఆమె ఇటీవల మృతి చెందిన వాసుదేవరెడ్డి, ఎస్‌బీఆర్‌పురంలో ఇటీవల మృతి చెందిన మణికంఠ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న తిమ్మయ్య ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొన్నారు. బాధితులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సురేష్‌రాజు, యాదవేంద్రరెడ్డి, సర్పంచ్ కుసుమ, మదన్‌మోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి, రామిరెడ్డి, కిరణ్, సుదర్శన్, మాదవరాజు, నాగరాజు, బాబు, రాజేష్, సుదర్శన్‌రాజు, చంద్ర, శ్రీను, శివ, భరత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఆర్‌పురంలో బాధితులను ఓదార్చుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని సత్కరిస్తున్న నేతలు

- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం(కార్వేటినగరం): అధికారం లేదని అధైర్యపడకండి, కార్యకర్తలకు, నాయకులకు పార్టీ అండగా నిలుస్తుందని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మంగుంట గ్రామానికి చెందిన జడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డిని నాయకులతోపాటు కలసి పరామర్శించారు. గతంలో జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేస్తూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రమణప్రసాద్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడడం తనను కలచి వేస్తోందన్నారు. మండలంలోని జీఎంఆర్ పురం గ్రామానికి చెందిన పార్టీ యువనాయకుడు, ఐటీ విభాగం కన్వీనర్ నూతన వరుడు రిషి, రంజిత దంపతులను ఆశీర్వదించారు. వైఎస్ఆర్ సీపీ మండల కన్వీనర్ మణి, నాయకులు గురవారెడ్డి, జనార్ధన్, బాబురెడ్డి, రైతు అధ్యక్షుడు వెంకటరెడ్డి, కుమార్, సాము, పట్టాభిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిలబడాలి

వెదురుకుప్పం: ఉత్తుత్తి హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పేదలను అన్ని రకాలుగా మోసం చేసిందని మాజీ ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి అన్నారు. మూడు నెలలుగా జర్మనీ దేశంలో ఉన్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి శనివారం రాత్రి పుత్తూరులోని స్వగృహానికి కుటుంబ సమేతంగా చేరుకున్నారు. ఈ సందర్భంగా గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆదివారం సాయంత్రం ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలకు న్యాయం చేయలేని దద్దమ్మలు తమపై విమర్శలు చేస్తున్నట్లు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో చెప్పిన హామీలను అమలు చేయాలని అడిగితే అక్రమ కేసులు బనాయించి గత ప్రభుత్వంపై నిందలు వేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. పేద ప్రజలకు అండగా నిలిచేందుకు అవసరమైతే ఎలాంటి పోరాటాలకై నా వెనకడుగు వేయకూడదని చెప్పారు. జెడ్పీటీసీ సుకుమార్, పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ మురళీరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, పద్మనాభరెడ్డి, బట్టే సుబ్రమణ్యం, శివాజీ, రోశిరెడ్డి, చిరంజీవిరెడ్డి, గోవిందన్, రామచంద్రారెడ్డి, పెద్దిరెడ్డి, నరేష్‌రెడ్డి, పురంధర్‌రెడ్డి, గఫూర్, బొజ్జారెడ్డి, హరినాథ్, విజయశేఖర్ రెడ్డి, పరంధామరెడ్డి, దేవరాజులు రెడ్డి, మురళీ, వెంకటేశ్ పాల్గొన్నారు.



జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని సన్మానిస్తున్న నాయకులు

అపరిశుభ్రంగా ఆరోగ్య ఉపకేంద్రం





బట్టి కండ్రిగ ఆరోగ్య ఉపకేంద్రం, అపరిశుభ్రంగా ఉన్న ఉపకేంద్రంలోని లోపలి భాగం

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం, బట్టికండ్రిగ గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రం అపరిశుభ్రంగా ఉంది. ఉపకేంద్రంలో రెండు భవనాలు ఉండగా, అందులో ఒక గదిలో మందులు నిల్వ చేసి ఉంది. అదే గదుల్లో మూగజీవాల మల, మూత్ర విసర్జన చేసినట్లు దర్శనమిస్తోంది. ప్రతి బుధ, శనివారం గర్భవతులు, పిల్లలు, బాలింతలకు వైద్య సేవలందించే ఉపకేంద్రం అపరిశుభ్రంగా ఉండడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకొని ఆరోగ్య ఉపకేంద్రాన్ని అనారోగ్యం నుంచి కాపాడాల్సి ఉంది.

పకడ్బందీగా పది పరీక్షలు

గంగాధరనెల్లూరు: నేటి నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారులు ఆంజనేయులుశెట్టి, యుగంధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారులు మాట్లాడుతూ గంగాధరనెల్లూరు మండలం వ్యాప్తంగా మొత్తం 699 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని తెలిపారు. గంగాధరనెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 320 మంది నెల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 165 మంది, తూగుంద్రం పాఠశాలలో 214 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

మండలం	హైస్కూల్	విద్యార్థులు	కేంద్రాలు
గంగాధనెల్లూరు	16	699	3
కార్వేటినగరం	10	368	2
పెనుమూరు	7	320	2
శ్రీరంగరాజుపురం	6	420	2
వెదురుకుప్పం	9	378	3
పాలసముద్రం	6	164	1



పాలసముద్రం ఉన్నత పాఠశాల



విద్యార్థుల కోసం సిద్ధమైన డెస్కులు

పాలసముద్రం: విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో 5 హైస్కూళ్లు, 1 ప్రైవేటు పాఠశాల ఉన్నాయి. ఈ స్కూళ్ల నుంచి పది పరీక్షలకు 164 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

అరగంట ముందుగా రావాలి



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెన్త్ పబ్లిక్ కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నాం. ఆరోగ్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాం. పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగా వచ్చి విద్యార్థులు తమకు కేటాయించిన గదులను చూసుకోవాలి.

–రాజేంద్రప్రసాద్, ఏంఈఓ, పాలసముద్రం మండలం

కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి



పదో తపగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్, టేబుల్స్, అన్ని గదుల్లో టేబుల్స్‌పై వారికి కేటాయించిన విద్యార్థుల హాల్ టిక్కెట్ల నెంబర్ వేశాం. నెట్ సెంటర్ నుంచి తీసుకున్న హాల్ టిక్కెట్లపై తప్పకుండా వారి స్కూల్ ప్రధానోపాధ్యాయుల సంతకం చేయించాలి. 15 నిమిషాల ముందుగానే ఇన్విజిలేటర్లు విద్యార్థుల వివరాలు నమోదు చేసుకుంటారు.

–సురేష్, డిపార్టుమెంట్ ఆఫీసర్

144 సెక్షన్ అమలు



నేటి నుంచి నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష కేంద్రం పరిధిలో అలజడి, గుంపులుగా ఉంటే చర్యలు తప్పవు. పరీక్ష నిర్వహించే సమయం వరకు జెరాక్స్ దుకాణాలు మూసేయాలి.

–అరుణ కుమారి, తహసీల్దార్, పాలసముద్రం

నేడు శివాలయంలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్ప దోషనివారణ పూజలు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దోషనివారణ చేసుకోవాలన్నారు.

ప్రమాదాల మలుపులు



ప్రమాదకరంగా కదిరిమంగళం మలుపు

- గాలిలో కలుస్తున్న ప్రాణాలు
- వేగ నియంత్రణకు చర్యలు చేపట్టండి

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలం తిరుపతి–చెన్నై బైపాస్ జాతీయ రహదారి మృత్యువుకు దగ్గరి దారిగా తయారైంది. ఇక్కడ ప్రమాదాలతో వాహనచోదకుల ప్రాణాలు గాలిలో కలిసిపోయి.. కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఈ ప్రాంతంలో ప్రమాదకరమైన రెండు మలుపుల వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు తప్పడం లేదు. నిత్యం అతి వేగంగా దూసుకుపోయే వాహనాలకు ఈ ప్రాంతంలో క్లెం పడడం లేదు. వడమాలపేట మండలం, కేఎల్ఎం ఆసుపత్రి నుంచి పాదిరేడు రోడ్డు వరకు ప్రమాదకరమైన మూడు మలుపులు ఉన్నాయి. ఈ ప్రాంతానికి చెందిన కొందరు వివిధ పనుల నిమిత్తం తిరుపతికి వెళ్లి తిరిగి ఇంటి వస్తూ, కేఎల్ఎం సర్కిల్, కదిరిమంగళం మలుపు వద్ద మృత్యువాత పడుతున్నారు. గతంలో ఇక్కడ పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రాంతంలో జాతీయ రహదారిపై వెళ్లే వాహనాలు అతి వేగంగా దూసుకుపోతుండడం తరచూ రోడ్డు ప్రమాదాలకు కారణమని మండల ప్రజలు చెబుతున్నారు. అతి వేగాన్ని నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు.

విద్యుత్ లైట్లు ఏర్పాటు

నెల క్రితం కదిరిమంగళం మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన జరిగిన వెంటనే అధికారులు జాతీయ రహదారిపై విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై వెళ్లే వాహనం అతి వేగంగా దూసుకు రావడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. అతి వేగాన్ని నియంత్రించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజన జీవనం.. దుర్భరం

వడమాలపేట మండలం, తిరుమణ్యం ఎస్టీ కాలనీ అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. ఈ గ్రామాల్లో కనీస వసతులు కూడా లేవు. మేజర్ పంచాయతీకి లక్షల రూపాయలు నిధులు కేటాయించినప్పటికీ, అభివృద్ధి అంకెల్లో తప్ప క్షేత్ర స్థాయిలో ఎక్కడా కనిపించడం లేదు. మురుగు కాలువలు, విద్యుత్ లైట్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఒకటి, రెండు తప్ప మిగిలిన వారికి పక్కా ఇళ్లు కూడా లేకపోవడంతో గుడిసెల్లోనే తలదాచుకుంటున్నారు.

–వడమాలపేట(విజయపురం)

- అభివృద్ధికి నోచుకోని ఎస్టీ కాలనీ
- కాలనీ చుట్టూ ముళ్లపొదలు
- బడిబాట పట్టని పిల్లలు



ముళ్లపొదలతో నిండిన ఎస్టీ కాలనీ సిమెంట్ రోడ్డు



తిరుమణ్యం ఎస్టీ కాలనీలో పూరి గుడిసెలు బడిబాట పట్టని పిల్లలు

వడమాలపేట మండలం తిరుమణ్యం ఎస్టీ కాలనీలో కేవలం 20 కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. వారికి సౌకర్యం కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఉపాధి హామీ పనులు కూడా కల్పించ లేకపోతున్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఇంటి వద్ద వదిలిపెట్టి ఉపాధి కోసం ఊరూరా తిరుగుతున్నారు. పిల్లలు బడికి వెళ్లకుండా మూగజీవాల మధ్య నలిగిపోతున్నారు.

కాలనీ చుట్టూ ముళ్లపొదలు

కాలనీలో అడుగు వేస్తే అడవిలో ఉన్నట్లు అనిపిస్తుంది. ఇంటి నివాసాల చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. నిత్యం విషసర్పాలు సంచరిస్తూ, ప్రజల మధ్య తిరుగుతున్నాయి. ఎప్పుడు ఏ పాము కాటు వేస్తుందో తెలియక స్థానిక ప్రజలు భయంతో బిక్కుబిక్కుమని జీవిస్తున్నారు. అటు రాజకీయ నాయకులు, ఇటు అధికారులకు చెప్పుకోవడానికి భయపడుతున్నారు.

అంధకారం

పంచాయతీకి లక్షల రూపాయల నిధులు వచ్చినా అభివృద్ధి అంకెల్లో తప్ప క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడంలేదు. ఎస్టీ కాలనీలో ఉన్న ఒక్క వీధిలో పూర్తి స్థాయిలో వీధిలైట్లు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఆరు దాటితే ఆరుబయట అడుగు వేయడానికి భయపడుతున్నారు. ముళ్ల పొదల్లో దాగి ఉన్న విషసర్పాలు ఎప్పుడు కాటు వేస్తాయో తెలియక భయాందోళన చెందుతున్నారు. తల్లిదండ్రులు ఉపాధి కోసం ఊరు విడిచి వెళ్లిపోతున్నారు. దీంతో పిల్లలు ఇళ్లల్లోనే ఉంటున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి వచ్చేంత వరకు పిల్లలు బడికి వెళ్లకుండా మూగజీవాల మధ్య తమ జీవితాలను వెళ్లదీస్తున్నారు. రాజకీయ నాయకులు, అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, తిరుమణ్యం గిరిజన కాలనీ అభివృద్ధి కోసం చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.